సాక్షి ఒడిశా
శనివారం । 31 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.64.351లు, బంగారం 1గ్రాము 50 మిల్లీగ్రాములు, వెండి 54 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాయగడలో చోరీ

స్థానిక న్యూకాలనీ గజలక్ష్మి పూజ కూడలిలో నివసిస్తున్న శుభ్రత్ పతి అనే వ్యాపారి ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది.

- 10లో



వియత్నాం నుంచి బుద్ధుని పవిత్ర అవశేషాల తరలింపు

● గవర్నర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పయనం - 10లో

న్యూస్‌రీల్

కుంతర్‌కల్‌లో న్యాయ చైతన్య శిబిరం



చైతన్య శిబిరంలో అధికారులు

జయపురం: జయపురం సమితి బలియ గ్రామ పంచాయతీ కుంతర్‌కల్ గ్రామంలో శుక్రవారం న్యాయ చైతన్య శిబిరాన్ని నిర్వహించారు. స్థాయి నిరంతర్ లోక్ అదాలత్ కార్యకలాపాలపై జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు నిర్వహించిన శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి ప్రద్యోమయి సుజాత వివరించారు. స్పెషల్ కోర్టు స్పెషల్ పోస్కో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ వి.గాయిత్రీ దేవి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.దివాకరరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ గీతాంజలీదోల్ పాల్గొన్నారు. లోక్ అదాలత్ ద్వారా కలిగే లాభాలు, ఉచితంగా లభించే న్యాయ సేవలపై చైతన్యం కలిగించారు. నీరు, విద్యుత్, వంటగ్యాస్, టెలిఫోన్ సేవలపై వివరించారు. దేవేంద్ర కొహూర్, పారా లీగల్ స్వచ్ఛంద సేవక్ దీప్తి నాయక్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

చేతి వృత్తులను ప్రోత్సహించాలి



శిబిరంలో పాల్గొన్న సరస్వతీ మాఝి, బిజయ్ కుమార్ తదితరులు

రాయగడ: చేతి వృత్తి పనులను నమ్ముకుని జీవనోపాధిని పొందుతున్న వారిని ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వృత్తుల వారికి అవగాహన శిబిరాన్ని జిల్లా పారిశ్రామిక కేంద్రం శుక్రవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేతి వృత్తులు చేసేవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ బిజయ్ కుమార్ సాహు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తి పనులవారి కోసం ప్రత్యేకంగా అమలు చేసిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అందరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డిప్యూటీ డైరెక్టర్ కోటి రత్నం, జిల్లా సాంస్కృతిక విభాగం అధికారి సుచిత్ర బౌరి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ట్రక్కులో దోపిడీ దొంగల అరెస్టు



బలిమెల పోలీసులు అరెస్టు చేసిన నిందితులు, వారి నుంచి స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్, మద్యం బాటిల్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసు స్టేషన్ పరిధిలో గల చితపరి వంతెన వద్ద ఈ నెలా 23న ఓ సిమెంట్ లోడ్‌ను దోపిడీ దొంగలు దోచుకున్నారు. దీనిపై ఐఐసీ ధీరజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులు చితపరి గ్రామ వాసులని తెలుసుకుని గ్రామానికి వెళ్లి వారిని అరెస్టు చేశారు. బబ్లు అనే వ్యక్తి కోసం మాత్రం గాలిస్తున్నారు. అరెస్టయిన ముగ్గురిలో ఒకరు బాలుడు.

పాముకాటుతో నాలుగేళ్ల బాలిక మృతి



బాలిక మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ 79 పోలీసుస్టేషన్ పరిధిలో గల శిమిలి బాంఛా పంచాయతీ బపాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో సంధ్య(4) అనే చిన్నారిని పాము కాటు వేసింది. బాలిక కేకలు వేయడంతో తల్లి లేచి చూసేసరికి పాము కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు పామును చంపి బాలికను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కానీ దారిలోనే పాప చనిపోయింది. విషయం తెలుసుకున్న ఎంవీ 79 పోలీసులు ఆరోగ్య కేంద్రానికి చేరుకుని బాలిక మృతిపై కేసు నమోదు చేశారు.

రథ చక్రాలు సిద్ధం



చక్రం మధ్య భాగం తయారీ

భువనేశ్వర్: జగతి నాథుని యాత్ర కోసం 3 రథాల తయారీ పనులు అంచెలంచెలుగా పూర్తవుతున్నాయి. నిర్ధారిత కాల పరిమితిలో ఈ పనుల్ని పూర్తి చేయడంలో వడ్రంగి సేవకులు నిరవధికంగా శ్రమిస్తున్నారు. రథాల్ని నడిపించే చక్రాల తయారీ ప్రధాన ఘట్టం. ఈ ఘట్టం విజయవంతంగా ముగించారు. అంచెలంచెలుగా 3 రథాల కోసం అవసరమైన 42 చక్రాల తయారీ పూర్తి చేశారు. మరో వైపు తయారైన చక్రాల్ని అమర్చేందుకు ఇరుసు పనులు చకచకా సాగుతున్నాయి. దశలవారీగా తయారు చేస్తున్న ఇరుసులకు చక్రాల్ని జోడించే పనులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ పనులు పూర్తి కావడంతో రథం పైఅంతస్తు రూపుదిద్దుకుంటుంది. అందుకు అవసరమైన పనులు ప్రారంభించారు. దేవదేవుళ్ల యాత్ర చేసే 3 రథాలు నడిపేందుకు సమగ్రంగా 42 చక్రాలు అమర్చుతారు. అత్యధికంగా శ్రీ జగన్నాథుని నంది ఘోష్ రథానికి 16 చక్రాలు అమర్చుతారు. బలభద్ర స్వామి తాళ ధ్వజం కోసం 14 చక్రాలు మరియు దేవీ సుభద్ర యాత్ర చేసే దర్ప దళనం కోసం 12 చక్రాలు తయారీ పూర్తయ్యింది.



చక్రం ప్రాథమిక దశ తయారీ



దశలవారీగా తయారైన చక్రం



చక్రం సిద్ధం



ఇరుసు అమరికకు సిద్ధమైన చక్రం

కఠిన చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జయపురం: జర్నలిస్టుల మీద దాడులు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉత్కళ జర్నలిస్టుల సంఘం కొరాపుట్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు జర్నలిస్టుల సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు నేతృత్వంలో జర్నలిస్టు ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝికి ఉద్దేశించిన వినతిపత్రం కలెక్టర్‌కు శుక్రవారం అందజేశారు. కొద్దిరోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల 'బొడొకబొరొ' పత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టు బిజయ ప్రధాన్‌ను బంధించి కాలు చేతులు కట్టేసి దాడులు జరిపారన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పాత్రికేయుల సురక్షా చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో సంఘ రాష్ట్ర కార్యదర్శి నృసింహ బ్రహ్మ, వర్కింగ్ కార్యదర్శి జయసింగ్ పతా సెట్టి, సుదర్శన పాత్రో, పి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయగడ: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిలో కాసీపూర్ సమితి కొడిపారి పంచాయతీలోని దుండా గ్రామానికి చెందిన జీతు నాయక్, తిరాంపూర్ గ్రామానికి చెందిన కర్ణ హరిజన్‌లు ఉన్నట్లు గుర్తించారు. తీవ్రగాయాలకు గురైన వీరిని చికిత్స కోసం టికిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కర్ణ హరిజన్ టికిరిలోని ఉత్కళ అలూమిన కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా తమ గ్రామం నుంచి వెళ్తుండగా ఎదురుగా మరో బైకుపై వస్తున్న జీతు నాయక్ అదుపు తప్పి ఢీకొన్నాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి.



గాయాలతో చికిత్స పొందుతున్న కర్ణ హరిజన్

మంచం మీద గర్భిణి తరలింపు



బురదలో తెస్తున్న గిరిజనులు



అంబులెన్స్ వద్దకు చేర్చిన దృశ్యం

కొరాపుట్: గ్రామానికి అంబులెన్స్ రాలేకపోవడంతో ఓ గర్భిణిని గిరిజనులు మంచం మీద తీసుకెళ్లినా శిశువును రక్షించుకోలేకపోయారు. నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి ఇచ్ఛాపూర్ పంచాయతీ డుముని గుడ గ్రామంలో చక్రధర్ జానీ భార్య బిమల జానీకి పురిటినొప్పులు వచ్చాయి. గ్రామస్తులు ప్రభుత్వ అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా మార్గం లేక రెండు కిలోమీటర్ల ముందు ఆగిపోయింది. దీంతో మంచం మీద గర్భిణిని అంబులెన్స్ వద్దకు చేర్చారు.

దారిలో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డలను జొరిగాం ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చగా వైద్యులు పరిశీలించి శిశువు మృతి చెందినట్లు ప్రకటించారు.

గుప్తేశ్వర క్షేత్రంలోకి కుక్కలపిల్లలతో ఇద్దరి ప్రవేశం



గుప్తేశ్వర్ గృహలో గుప్తేశ్వరుని పూజలు చేసేందుకు కుక్కలతో వచ్చిన యువకులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుప్తేశ్వర్ ఆలయంలోనికి ఇద్దరు యువకులు రెండు కుక్క పిల్లలతో ప్రవేశించటాన్ని భక్తులు తీవ్రంగా తప్పు పడుతున్నారు. గత బుధవారం జరిగిన ఈ సంఘటన నేడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇద్దరు యువకులు కుక్కలతో వచ్చి పూజలు చేశారని, ఇది గుప్తేశ్వర్ పుణ్య క్షేత్ర పవిత్రతకు, భక్తుల మనోభావాలకు భంగం కల్పించడమేనని విమర్శించారు. భవిష్యత్‌లో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తేనెటీగల దాడిలో భార్యాభర్తలకు గాయాలు



తేనెటీగల దాడిలో గాయపడిన దంపతులు

రాయగడ: తేనెటీగల దాడిలో భార్యభర్తలు గాయాలు పాలైన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. గాయాలు పాలైనవారు సమితిలోని కడంగేలి గ్రామానికి చెందిన కద్రక మిసి, కద్రక కొమరాడిలుగా గుర్తించారు. తమ గ్రామం నుంచి కల్యాణ సింగుపూర్ సొంత పనులపై వెళ్లి తిరిగి వస్తుండగా కల్యాణి నది బ్రిడ్జి కింద ఉన్న తేనెపట్టు నుంచి ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ఇద్దరు గాయాల పాలయ్యారు. వెంటనే అక్కడ ఉన్నవారు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం వారు స్వగ్రామానికి చేరుకున్నారు.

సిక్కిం తీస్తా నదిలో బస్సు బోల్తా

● ఒకరు మృతి, 8 మంది గల్లంతు
● బాధితుల్లో ఒడిశా వాసులే అధికం



ప్రమాదంలో గల్లంతైన బీజేపీ నేత ఇతిశ్రీ జెనా



సిక్కిం ముఖ్యమంత్రితో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్ష సంప్రదింపులు

భువనేశ్వర్: సిక్కింలోని తీస్తా నదిలో టూరిస్టు బస్సు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. 8 మంది గాయపడ్డారు. బాధితుల్లో ఒడిశాలోని జాజ్‌పూర్ రోడ్ ప్రాంతానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఇతిశ్రీ జెనా కుటుంబ సభ్యులు ఉన్నారు. పర్యాటకుల్లో అత్యధికులు ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని సమాచారం. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఈ బస్సు 11 మంది వ్యక్తులతో (10 మంది పర్యాటకులు మరియు ఒక డ్రైవర్) ప్రయాణిస్తున్నట్లు సమాచారం. కొండ రోడ్డు నుంచి జారిపోవడంతో దుర్ఘటన చోటు చేసుకుంది. సిక్కిం రాజధాని నగరం గ్యాంగ్‌టక్ నుంచి పర్యాటకులను తీసుకువెళుతుండగా ఈ దురదృష్టకర సంఘటన సంభవించింది. మంగన్ జిల్లా పోలీసు సూపరింటిండెంట్ సోనమ్ దేచు భూటియా సమాచారం ప్రకారం ఒక మృతదేహాన్ని వెలికి తీశారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన వారిని రక్షించారు. గాయపడిన వారిని మంగన్ జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రికి తరలించారు.

సీఎం మాఝీ జోక్యం

రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సిక్కిం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని అవసరమైన అన్ని వనరులను సమీకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్‌తో ఫోన్‌లో సంప్రదించారు. అదనంగా అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఒడిశా నుంచి ఒక ప్రత్యేక సహాయ బృందాన్ని పంపించారు. బాధితులకు తక్షణ చికిత్స, వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. గల్లంతైన వారిలో 6 మంది ఒడియా వ్యక్తులు ఉన్నట్లు భోగట్టా. రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా కార్యదర్శి ఇతిశ్రీ జెనా కుటుంబీకులు, బంధువులతో కలిసి సిక్కిం పర్యటనకు వెళ్లారు. ఆదివారం జాజ్‌పూర్ రోడ్ నుండి రైలులో ప్రయాణించారు. గాంగ్‌టక్ 1000 అడుగుల ఎత్తున ఉన్న ఒక ప్రదేశం సందర్శించి తిరిగి వస్తుండగా దుర్ఘటన చోటు చేసుకుందని ఆమె బంధువు తెలిపారు. వీరంతా 2 వేర్వేరు వాహనాల్లో సర్దుకుని తిరిగి వస్తుండగా ఒక వాహనంలో నదిలోకి జారింది. ఇతిశ్రీ జెనా ఆమె కుమారుడు మరో 2 మంది బంధువులతో కలిసి వెళ్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. వారిలో ఇద్దరు పిల్లల జాడ గుర్తించారు. వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారి జాడ ఇంత వరకు లభ్యం కాలేదని బంధువు వాపోయాడు.

ఈ విషాదకరమైన ప్రమాదం పట్ల ఓలీవుడ్ నటుడు , కొరై నియోజక వర్గం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతిశ్రీ జెనా తన కుటుంబంతో కలిసి సిక్కింలోని గ్యాంగ్‌టక్‌కు విహారయాత్రకు వెళ్లారు. వారు రెండు వాహనాల్లో వెళ్లారు. ఒక వాహనం నదిలో పడిపోయింది. దానిలో ప్రయాణిస్తున్న కుటుంబీకులు గల్లంతు అయ్యారు. అదృష్టవశాత్తూ ఇద్దరు చిన్న పిల్లలకు పెను గండం తప్పింది. గాయపడి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సిక్కిం ముఖ్యమంత్రితో సంప్రదిస్తున్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

ఒడిశా తొలి బీజేపీ ఎమ్మెల్యే ప్రసన్న పట్నాయక్ కన్నుమూత



శాసన సభ ఆవరణలో తుది వీడ్కోలు



ప్రసన్న పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే, ప్రముఖ రాజకీయ నాయకుడు ప్రసన్న పట్నాయక్ (74) శుక్రవారం శాశ్వతంగా కన్నుమూశారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన కామాఖ్యనగర్ నియోజక వర్గం నుంచి తొలి బీజేపీ అభ్యర్థిగా శాసన సభకు ప్రాతినిధ్యం వహించి చరిత్ర సృష్టించారు. ఈ నేపథ్యంలో ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ఒక ముఖ్యమైన యుగాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర రాజకీయ రంగంలో ఆయన ఒక ప్రముఖమైన వ్యక్తిగా ప్రత్యేక ఉనికిని చాటుకున్నారు.

1977లో జనతా పార్టీ అభ్యర్థిగా శాసన సభ్యుడిగా ఎన్నికై రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. 1985లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రాష్ట్ర శాసన సభలో కామాఖ్య నగర్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ విజయంతో ఆయన రాష్ట్ర శాసన సభలో తొలి బీజేపీ ఎమ్మెల్యేగా చరిత్ర ఆవిష్కరించారు. ఆ తర్వాత బీజేపీకి గుడ్‌బై పలికి 1990లో బిజూ జనతా దళ్ అభ్యర్థిగా పోటీ చేసి మరోసారి కామాఖ్యనగర్ నియోజకవర్గం నుంచి ఎన్నికై విజేతగా నిలిచారు. ఈ లెక్కన ఆయన కామాఖ్యనగర్ నియోజక వర్గం నుంచి శాసన సభకు 3 సార్లు ఎన్నిక కావడం విశేషం. ఆయన పదవీకాలంలో తన నియోజక వర్గంలో అత్యధికంగా 15 విద్యా సంస్థల్ని ఏర్పాటు చేశారు. ఆయన మృతికి రాష్ట్ర ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ప్రసన్న పట్నాయక్ ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని కొనియాడారు. అనేక మంది ప్రముఖ రాజకీయ నాయకులు ఆయన మరణం రాష్ట్ర రాజకీయ రంగంలో భర్తీ కాలేని శూన్యంగా మిగిలిపోతుందని విచారం వ్యక్తం చేశారు.

అంతిమ వీడ్కోలు

దివంగత ఎమ్మెల్యే ప్రసన్న పట్నాయక్ పార్థివ దేహం రాష్ట్ర శాసన సభ ఆవరణకు తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన సభ స్పీకరు సురమా పాఢి మరి కొంత మంది శాసన సభ సభ్యులు, ప్రముఖులు శ్రద్ధాంజలి ఘటించి అంతిమ వీడ్కోలు పలికారు. తదుపరి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆవరణలకు దివంగత నాయకుని పార్థివ దేహం తరలించారు. కార్యాలయం ప్రాంగణంలో పలువురు పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన అంత్యక్రియలు పూరీ స్వర్గద్వార్ స్మశాన వాటికలో నిర్వహించినట్లు కుటుంబ సభ్యుల సమాచారం.

ఈ ఏడాదే కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

● ఆనందం వ్యక్తం చేస్తున్న జయపురం వాసులు



జయపురంలో సిద్ధం చేసిన కేంద్రం విద్యాలయం

జయపురం: జయంపురం పట్టణ ప్రజలు ఎప్పుడా అని ఎదురు చూస్తున్న కేంద్ర విద్యాలయం ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం కానున్నది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాలకు ఆసక్తి ఉన్నవారి వివరాలు నమోదు ప్రారంభించాలని అధికారులు వెల్లడించారు. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని ఇంటిగ్రేటెడ్ ట్రైబుల్ డవలప్‌మెంట్ ఏజన్సీ(ఐటీడీఏ) భవనంలో కేంద్ర విద్యాలయాన్ని ప్రస్తుతానికి ఏర్పాటు చేశారు. పూర్తి వివరాలు అందిన వెంటనే మీడియాకు తెలియజేయనున్నట్లు కొరాపుట్ కేంద్ర విద్యాలయ ప్రిన్సిపాల్ సరోజ్ కుమార్ దాస్ వెల్లడించారు. వాస్తవంగా 2024 డిసెంబర్‌లో జయపురం కేంద్ర విద్యాలయం ప్రారంభం కానున్నదని సాక్షాత్తు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గతంలో ప్రకటించారు. 2025-26 విద్యా సంవత్సరంలోవి ద్యాబోధన ప్రారంభ మౌతుందని ప్రకటించారు. కేంద్ర విద్యాలయం ప్రారంభానికి తేదీ నిర్ణయించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా వర్చువల్‌గా ప్రారంభిస్తారని సంబంధిత అధికారులు ప్రకటించారు. అందుకు జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాట్లు ప్రారంభించారు. అకస్మాత్తుగా కేంద్ర మంత్రి అమిత్‌షా ఒడిశా పర్యటన రద్దు కావటంతో కేంద్రవిద్యాలయ ప్రారంభోత్సవం రద్దు అయింది. అప్పటి నుంచి కేంద్ర విద్యాలయంలో తమ పిల్లల పేర్లు నమోదు చేసేందుకు ఎదురు చూశారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరచి అడ్మిషన్‌లు ప్రారంభం కావటంతో కేంద్ర విద్యాలయంపై ఆశలు వదులుకున్న తల్లిదండ్రులు నిరాశ చెంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో తమ పిల్లల పేర్లు నమోదు చేసుకున్నారు. ఇంతలో ఏ ఏడాది నుంచే కేంద్రీయ విద్యాలయం ప్రారంభమౌతుందని.. అడ్మిషన్‌లకు పేర్లు నమోదు చేసుకోవచ్చని విజ్ఞప్తి వెల్లడి కావటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు ప్రిన్సిపల్ సెక్రటరీ రాక



సమీక్ష చేస్తున్న పీడీ సుధాకర్

నరసన్నపేట: పీఆర్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ శనివారం మండలానికి వస్తున్నారని డ్వామా పీడీ సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సెక్రటరీ రాక సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక అధికారులతో సమీక్షించారు. నరసన్నపేట, బొరిగివలస, లుకలాంల్లో ఆయన పర్యటిస్తారని తెలిపారు. కార్యక్రమాల్లో స్థానిక అధికారులు పాల్గొనాలని సూచించారు. సమీక్షలో ఎంపీడీఓ మధుసూదనరావు, ఏపీఓ యుగందర్‌లతో పాటు పీఆర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రేపు మోడల్ డీఎస్సీ పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మోడల్ డీఎస్సీ–2025 ఎస్‌జీటీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.మురళీమోహన్‌రావు, డి.కేవశరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న పీఆర్‌టీయూ భవనంలో ఉదయం 9 గంటలకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారు ఢీకొని పరిశ్రమ ఉద్యోగికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్ : అల్లినగరం కూడలి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పైడి భీమవరం అరబిందో పరిశ్రమ ఉద్యోగి గాయపడ్డాడు. గార మండలం శ్రీకూర్మం గ్రామానికి చెందిన పందిరి పాపారావు శుక్రవారం బైక్‌పై విధులకు వెళ్తుండగా అల్లినగరం కూడలి సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పాపారావును 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేయగా కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రూరల్ మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. రిమ్స్ ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

గోవులు స్వాధీనం



ఎచ్చెర్ల: నరసన్నపేట వైపు నుంచి విశాఖపట్నం వైపు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఆవులను శుక్రవారం లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై ఎస్సై జి.లక్ష్మణరావు పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్ పోలవరపు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



ప్రవల్లిక మృతదేహం

కొత్తూరు: మహర్తాపురంలో ప్రవల్లిక (26) అనే వివాహిత శుక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కొత్తూరు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం వడ్డంగి గ్రామానికి చెందిన పత్తిక సురేష్‌కు గుమ్మలక్ష్మీపురం మండలం కేదారపురం గ్రామానికి చెందిన నమ్మక ప్రవల్లికతో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. సురేష్ జియో టవర్ కంపెనీలో పనిచేస్తున్నందున కొత్తూరులోని మహర్తాపురంలో భార్యతో కలిసి నివాసముంటున్నాడు. ఎప్పటిలాగే సురేష్ శుక్రవారం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ప్రవల్లిక ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. కాగా, అల్లుడు సురేష్ అదనపు కట్నం తీసుకురావాలని నిత్యం వేధింపులకు గురిచేస్తున్నందున కుమార్తె ప్రవల్లిక ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి అరుణకుమారి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, భర్త సురేష్ వేధిస్తున్నట్లు ప్రవల్లిక గతంలోనూ బత్తిలి, గుమ్మలక్ష్మీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎచ్చెర్ల : రైతులు సాగు యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ స్వామి తెలిపారు. చిలకపాలెంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగోలు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్ బాబు మాట్లాడుతూ వరి రకాలు, తెగుళ్లను వివరించారు. అనంతరం నవధాన్యాలు, విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గాంధీ, వ్యవసాయ సహాయ సంచాలకులు బగ్గు రజనీ, భవానీశంకర్, కేవీకే శాస్త్రవేత్త సునీత, మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్, ప్రకృతి మాస్టర్ ట్రైనర్ నాయుడు, విస్తరణాధికారులు జగన్మోహన రావు, రేవతి తదితరులు పాల్గొన్నారు.

వియత్నాం నుంచి బుద్ధుని పవిత్ర అవశేషాల తరలింపు



భారత్ నుంచి వియత్నాంకు బుద్ధుని పవిత్ర అవశేషాల తరలింపు (ఫైల్)

- గవర్నర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పయనం

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ఆధ్వర్యంలో వియత్నాం నుంచి భారత దేశానికి బుద్ధుని పవిత్ర అవశేషాల తరలింపు కోసం ప్రత్యేక ప్రతినిధి బృందం శుక్రవారం న్యూ ఢిల్లీకి బయలుదేరింది. జూన్ 2న న్యూ ఢిల్లీ నుంచి ఈ బృందం వియత్నాంకు వెళ్తుంది. ఐక్యరాజ్య సమితి వెసాక్ దినోత్సవాల సందర్భంగా భారతదేశం నుంచి వియత్నాంకు తీసుకెళ్లారు. ఏటా మే నెలలో పౌర్ణమి నాడు ఈ వేడుకలు ప్రారంభిస్తారు. ఈ ఏడాది మే 6 నుంచి 8 వరకు వెసాక్ వేడుకల సందర్భంగా వియత్నాంలో బుద్ధుని అవశేషాలు ప్రదర్శించారు. బుద్ధుని జననం, జ్ఞానోదయం, మరణం వరకు చోటు చేసుకున్న అపురూప ఘట్టాల స్మరణకు ప్రతీకగా వెసాక్ వేడుకలు నిర్వహిస్తారు. ప్రస్తుతం బుద్ధుని అవశేషాలను వియత్నాంలోని అనేక ప్రదేశాలలో ప్రదర్శిస్తున్నారు. బుద్ధ భగవానుడు తన మొదట ఉపన్యాసం ఇచ్చిన పవిత్ర స్థలం సారనాథ్ నుంచి అవశేషాలను ప్రత్యేక భారత వైమానిక దళ విమానంలో వియత్నాంకు తరలించారు. కేంద్ర బలహీన వర్గాలు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, బౌద్ధ సన్యాసులు, సీనియర్ భారత అధికారుల బృందం ఆధ్వర్యంలో వీటిని వియత్నాం చేర్చారు. ఈ బృందంతో ది జర్నీ ఆఫ్ గౌతమ బుద్ధ' నృత్య నాటక ప్రదర్శన కోసం ప్రత్యేక భారతీయ సాంస్కృతిక బృందం హో చి మిన్ నగరం, హనోయ్ తదితర ప్రదేశాలలో బుద్ధుని జీవితం, బోధనలను చిత్రీకరించిన నాటకం ప్రదర్శించింది.

ఈ వేడుకలు జూన్ 2తో ముగియనున్నాయి. ఆ తర్వాత బుద్ధ భగవానుని పవిత్ర అవశేషాలు వియత్నాంలోని డా నాంగ్ నగరం నుంచి ప్రత్యేక భారత వైమానిక దళ విమానంలో భారత దేశానికి తిరిగి తీసుకుని వచ్చేందుకు రాష్ట్ర గవర్నరు డాక్టరు హరి బాబు కంభంపాటి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతినిధి బృందం బయల్దేరింది.

ఈ సందర్భంగా గవర్నర్ కంభంపాటి మాట్లాడుతూ బుద్ధుని పవిత్ర అవశేషాలను భారత దేశానికి తిరిగి తీసుకు రావడం గౌరవప్రదమైన విషయమని, ఈ ఆధ్యాత్మిక ప్రయాణం వియత్నాంతో మన ఉమ్మడి నాగరిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.

టికెట్ తనిఖీ సిబ్బందికి డీఆర్‌ఎం సన్మానం



డీఆర్‌ఎం సన్మానం పొందిన టికెట్ తనిఖీ బృందం

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం టికెట్ తనిఖీ సిబ్బంది సేవల్ని స్థానిక మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం హర్విందర్ సింగ్ బజ్వా ప్రశంసించారు. ఈ నేపథ్యంలో టికెట్ లేని ప్రయాణికుల నుంచి ఖుర్దా రోడ్ మండలం రికార్డు స్థాయి జరిమానా వసూలు చేసిందన్నారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో 13 మంది టికెట్ తనిఖీ సిబ్బందిని ప్రత్యేకంగా సన్మానించారు. టికెటు లేని ప్రయాణం నివారించడంలో ముందంజ పాత్ర పోషించిన జితేంద్ర పట్నాయక్, నిరాకర్ సాహు, సుధాకర్ బెహరా, శివ ప్రసాద్ దాస్, అజయ్ కుమార్ సాహు, సుధీర్ కుమార్ సాహు, కె. పి. సామంత, ప్రశాంత్ కుమార్ బెహెరా, సి. హెచ్. బి. రెడ్డి, కె. సి. మల్లిక్, ఆర్. ఆర్. ప్రసాద్, ఎస్. కె. మహాపాత్రోకు డీఆర్‌ఎం ప్రసంశా పత్రంతో నగదు పురస్కారం ప్రదానం చేశారు. సమలేశ్వర్ బెహెరాను సత్కరించారు.

వాణిజ్య విభాగం అద్భుత కార్యదక్షతతో ఈ సంవత్సరం తూర్పు కోస్ట్ రైల్వేలో కమర్షియల్ షీల్డ్‌ని ఖుర్దారోడ్ మండలం సాధించిందని డీఆర్‌ఎం అభినందించారు. ఈ కార్యక్రమానికి మండల సీనియర్ వాణిజ్య అధికారి (ఎస్‌డీసీఎం) ఎస్. అనిల్ కుమార్, మండల వాణిజ్య అధికారి (డీసీఎం) పూజా సింగ్ పాల్గొన్నారు. డీఆర్‌ఎం సన్మాన గ్రహీతలకు అఖిల భారత టికెటు తనిఖీ సిబ్బంది సంఘం ప్రముఖులు లక్ష్మీధర మహంతి, అనిల్ మిశ్రా, బభ్రువా బాహన్ బెహెరా, సత్యరంజన్ పట్నాయక్ హాజరయ్యారు.

శరీర సౌష్టవ పరీక్షల్లో మరొకరు మృతి



హోంగార్డుల పోస్టులకు గుమ్మరోడ్డులో 2 కిలోమీటర్ల రన్నింగ్ రేస్



దీపక్ పడాల్(29)

పర్లాకిమిడి: గుమ్మా రోడ్డు జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన హోంగార్డ్స్ పోస్టుల భర్తీలో శరీర సౌష్టవ పోటీ పరీక్షల్లో మరో అభ్యర్థి దీపక్ పడాల్ (29) ఛాతీ నొప్పితో బరంపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలియజేశారు. మృతుడు దీనపక్ పడాల్ రాయఘడ బ్లాక్ నారాయణ్‌పూర్ గ్రామవాసి. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి దీపక్ పడాల్ కుటుంబానికి సంతాపం ప్రకటిస్తూ రూ.4లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేశారు. పర్లాకిమిడిలో రామగిరి పంచాయతీ పరిసల్ గ్రామానికి చెందిన సులాంత్ మిసాల్ (24) ఛాతీ నొప్పితో కుప్పకూలిన అనంతరం పర్లాకిమిడి ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందిన విషయం తెలిసిందే.

పోడియా సమితిలో ప్రబలిన వ్యాధులు!



మందుల చీటీలతో గ్రామస్తులు గ్రామస్థులు



రోగులను పరీక్షిస్తున్న భువనేశ్వర్ నుంచి వచ్చిన వైద్య బృందం సభ్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితిలో కొన్ని రోజులుగా వింత వ్యాధితో గిరిజనులు బాధపడుతున్నారు. అయితే ఏ వ్యాధి అనే విషయాన్ని ఇప్పటికీ వైద్యులు గుర్తించలేకపోయారు. వ్యాధి సోకిన వారు కీళ్ల నొప్పులు, జ్వరం, శరీరం పొంగిపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. చిన్న పిల్లలు ఈ వ్యాధిబారిన ఎక్కువ మంది పడుతున్నారు. స్పందించిన ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా భువనేశ్వర్ నుంచి ఐఐఎంఆర్‌సీ బృందం పోడియా సమితికి శుక్రవారం చేరుకుంది. గ్రామాల్లో పర్యటించి ప్రజలు వినియోగిస్తున్న నీటిని పరీక్షించారు. దోమలగుడ్లను పరిశీలించి నమనాలు సేకరించారు. అలానే రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. వీటిని భువనేశ్వరలోని మెడికల్ ల్యాబకి పంపించారు. పరీక్షల తరువాత రిపోర్టు వస్తే వ్యాధికి కారణాలు తెలుస్తాయని వైద్యాధికారులు వెల్లడించారు.



దోమల గుడ్లను సేకరిస్తున్న వైద్య బృందం



నీటిని పరిశీలిస్తున్న వైద్యులు

పర్లాకిమిడిలో వర్షం

పర్లాకిమిడి: జిల్లాలోని పర్లాకిమిడి, గుమ్మా, కాశీనగర్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. అయితే వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ఈడీ డిప్యూటీ డైరెక్టర్ చింతన్ రఘువంశీ అరెస్టు



చింతన్ రఘువంశీ

భువనేశ్వర్: సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వ్యూహాత్మక దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డిప్యూటీ డైరెక్టర్ చింతన్ రఘువంశీ (ఐఆర్‌ఎస్)ని అరెస్టు చేసింది. చింతన్ రఘువంశీ తొలి వాయిదా కింద రూ. 20 లక్షల లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అవినీతి ఆరోపణల ఫిర్యాదు మేరకు వ్యూహాత్మకంగా అతన్ని పట్టుకున్నట్లు వివరించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కేసును పరిష్కరించడానికి కుదిరిన రూ. 5 కోట్లు లంచం వ్యవహారంలో తొలి విడత కింద చెల్లింపు జరుగుతుండగా సీబీఐ వ్యూహాత్మకంగా అక్కడికక్కడే నిర్బంధంలోకి తీసుకుంది. ఈడీ డిప్యూటీ డైరెక్టర్ సోదరుడు ఈ వ్యవహారానికి రాయబారిగా వ్యవహరించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ విషయంపై సీబీఐ తదుపరి దర్యాప్తు ప్రారంభించింది.

సమలాయి దుర్గా పండుగ ప్రారంభం



సమలాయి దుర్గా అమ్మవారు

రాయగడ: స్థానిక పాయికోవీధిలోని సమలాయి దుర్గా వార్షిక పండుగ శుక్రవారం నుంచి ప్రారంభమయ్యింది. సాయంత్రం పాయికోవీధి నుంచి మజ్జిగౌరి మందిరం పాదాల గుడి వరకు ఊరేగింపుగా వెళ్లిన భక్తులు అమ్మవారి పాదాలను తీసుకువచ్చి సమలాయి దుర్గ మందిరంలో నిలపడంతో పండుగకు శ్రీకారం చుట్టారు. ఐదు రోజులు జరిగే పండుగ జూన్ మూడో తేదీతో ముగుస్తుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

కటక్‌లో తొలి కోవిడ్ రోగి గుర్తింపు

భువనేశ్వర్: కటక్ జిల్లాలో తొలి కోవిడ్ – 19 కేసు నమోదు అయింది. జిల్లా ప్రధాన వైద్య అధికారి సీడీఎంఓ ప్రశాంత్ హత్తా ఈ విషయాన్ని నిర్ధారించారు. పీడితుడు స్థానిక 44 ఏళ్ల వ్యక్తిగా పేర్కొన్నారు. ప్రస్తుతం గృహ నిర్బంధంలో కోవిడ్ సంబంధిత జాగ్రత్తలతో పరిశీలనలో ఉన్నాడు. దీనికి ముందు అతనికి ప్రయాణ చరిత్ర లేదని తెలిపారు. జలుబు, జ్వరం లక్షణాలు కనిపించడంతో పరీక్షలు చేయించుకోవడంతో కోవిడ్ – 19 సోకినట్లు ఖరారైంది.

రాయగడలో చోరీ



దొంగతనం జరిగిన ఇల్లు



బాధితుడు శుభ్రత్ పతి



విరగ్గొట్టిన బీరువాలు

రాయగడ: స్థానిక న్యూకాలనీ గజలక్ష్మి పూజ కూడలిలో నివసిస్తున్న శుభ్రత్ పతి అనే వ్యాపారి ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగలు ఇంటి వెనుక నుంచి చొరబడి రెండు బీరువాలను విరగ్గొట్టి రూ.10 లక్షల నగదు, 20 తులాల బంగారు ఆభరణాలతో పాటు మరో 2 కిలోల వెండి ఆభరణాలను దొంగిలించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాధితుడు శుభ్రత్ తమ ముందరి ఇంట్లో కుటుంబంతో ఎప్పటిలాగే నిద్రించగా, వెనుక ఇంటి తలుపులకు తాళాలు వేశారు. ఇది గమనించిన దుండగులు ఇంటి వెనుక నుంచి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. సీసీ కెమెరాలు పరిశీలించిన ఐఐసీ కేకే బీకే కుహరో, సిబ్బంది ఇద్దరు దుండగులు ముఖాలను గుడ్డతో మూసివేసుకుని దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. కాగా దొంగతనం చేసిన అనంతరం, దుండగులు తాము దొంగిలించిన బంగారు గొలుసులను మెడలో వేసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్తున్నట్లు కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా దుండగులను పట్టుకుంటామని పోలీసులు తెలియజేశారు. గత కొద్దిరోజులుగా పట్టణంలో చోటు చేసుకుంటున్న వరుస దొంగతనాల కారణంగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు

విజిలెన్స్‌కు చిక్కిన చీఫ్ ఇంజినీర్

- రూ. 2.51 కోట్లు స్వాధీనం



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు



కిటికీ నుంచి రువ్వేసిన రూ. 500 నోట్ల కట్టలు

భువనేశ్వర్: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణ ఆధారంగా చేపట్టిన దాడుల్లో విజిలెన్స్ విభాగం భారీ స్థాయిలో నగదు స్వాధీనపరచుకుంది. ఈ దాడుల్లో రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీరు బైకుంఠ నాథ్ షడంగికి సంబంధించిన ఆస్తులపై పలు చోట్ల శుక్ర వారం విజిలెన్సు వర్గాలు సోదాలు నిర్వహించారు. నిందితుడు ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నట్లు సమాచారం. విజిలెన్స్, ఎనిమిది మంది డీఎస్పీలు, 12 మంది ఇన్‌స్పెక్టర్లు, 6 మంది సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సహాయక సిబ్బంది అంగుల్ విజిలెన్స్ ప్రత్యేక న్యాయమూర్తి జారీ చేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా సోదాలు నిర్వహించారు. అంగుల్, భువనేశ్వర్, పిప్పిలి (పూరీ) తదితర 7 ప్రదేశాలలో సోదాలు నిర్వహించారు.

విజిలెన్స్ అధికారులను చూడడంతో బైకుంఠ నాథ్ షడంగి భువనేశ్వర్‌లోని తన ఫ్లాట్ కిటికీలోంచి రూ. 500 నోట్ల నగదు కట్టలను బయటకు రువ్వేసినట్లు ఆరోపణ. అంగుల్‌లోని షడంగి ఉంటున్న ఇంటి నుంచి రూ.1.30 కోట్లు, భువనేశ్వర్‌లోని అతని ఫ్లాట్ నుంచి రూ.1.21 కోట్లు సమగ్రంగా రూ. 2.51 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికార వర్గాల సమాచారం. నిందితుడు షేర్ మార్కెట్‌లో భారీగా రూ. 2.70 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు సోదాల్లో తేలింది. విజిలెన్స్ దాడుల సమయంలో 2 బహుళ అంతస్తుల భవనాలు, రెండు ఫ్లాట్లు, 7 అధిక విలువైన ప్లాట్లు, బీమా, రూ. 1.5 కోట్ల విలువైన బ్యాంక్ డిపాజిట్లు ఉన్నట్లు కనుగొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మానిటరింగ్ కమిటీ సమావేశంలో అధికారులు

పర్లాకిమిడి: ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు అన్నారు. స్థానిక గజపతి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగినది. పదేళ్ల పైబడిన ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దాస్ అన్నారు. 0 – 5 ఏళ్ల వయస్సు బాలబాలికలు కూడా ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని అన్నారు. దీని కోసం ఆధార్ కేంద్రాలను బ్యాంకులు, పోస్టాఫీసులు, బ్లాక్ కార్యాలయాలు, ఎన్.ఏ.సి.లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకు అక్కౌంటుకు లింక్ చేసుకోవాలని అన్నారు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వం అందజేసే అనేక ప్రభుత్వ పథకాలు, విద్యార్థులకు విద్యాభృతి, రేషన్ కార్డు, సుభద్ర వంటి తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అన్నారు.

అధికారులు పంచాయతీ స్థాయి నుంచి మున్సిపల్, ఎన్ఏసీల వరకూ చైతన్య ర్యాలీలు నిర్వహించాలని కోరారు. జిల్లా ముఖ్యవైద్యాధికారి మహమ్మద్ ముబారక్ ఆలీ, మహిళా సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి, జిల్లా సామాజిక సురక్షా అధికారి సంతోష్ కుమార్ నాయక్, లీడ్ బ్యాంకు మ్యానేజరు మహేశ్వర్ మండళ్, చిరంజీవి దొర పాల్గొన్నారు.

నబరంగ్‌పూర్ మున్సిపాలిటీలో అవినీతి

- మాజీ ఎంపీ ప్రదీప్ మఝి ఆరోపణ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ప్రదీప్ మఝి, సౌమ్య మహాపాత్రో, బీజేడీ నాయకులు



విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనుల్లో అవినీతి చోటుచేసుకుందని బీజేడీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ ప్రదిప్ మఝి ఆరోపించారు. శుక్ర వారం జిల్లా కేంద్రంలో గ్లేజ్ హోటల్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య పేరిట కోట్లాది రూపాయలు కొట్టేశారన్నారు. ఆర్‌టీవో ఆఫీస్ వద్ద డంపింగ్ యార్డ్ కోసం గోతులు తీయడానికి రు.26 లక్షలు ఖర్చు చేసినట్లు నిధులు డ్రా చేశారన్నారు. అసలు అక్కడ గోతులు తీయలేదని, తీసిన గోతులు ఎక్కడ ఉన్నాయని,వెలికి వచ్చిన మట్టి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. 1300 గుంటలు జేసీబీతో పని చేసినట్లు రికార్డులు పుట్టించారన్నారు. అలా చేస్తే నాలుగు పెద్ద చెరువులు తయారు చేయవచ్చనన్నారు. గత ఆరు నెలలుగా డంపింగ్ యార్డ్‌లో పని చేసిన వారికి రూ. 13 లక్షలు వేతనాలు చెల్లించినట్లు చూపించారన్నారు. కానీ ఇదే పనికి నాలుగు ఎస్‌హెచ్‌జీలకు మరో రూ. 13 లక్షలు చెల్లించినట్లు నిధులు డ్రా చేశారన్నారు. ఒకే పనికి రెండు చెల్లింపులు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. వీధులను చీపురుతో ఊడ్చడానికి నెలకు రూ..13 లక్షలు వేతనాలు 135 మందికి ఇస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. కానీ అంత మంది పని వాళ్లని వినియోగించడం లేదన్నారు. కమర్షియల్ ప్రాంతాలలో సాయంత్రం శుభ్ర పరుస్తున్నట్లు వేతనాలు డ్రా చేశారన్నారు. కానీ తనకు తెలిసి ఏనాడు నబరంగ్‌పూర్ పట్టణంలో సాయంత్రం శుభ్రపరిచినట్లు ఆధారాలు లేవన్నారు. ప్రతి నెల కాలువల క్లినింగ్ కోసం రూ. 5 లక్షలు వాడుకున్నారన్నారు. కానీ ప్రముఖులు ఉండే వీధులలో మాత్రమే కాలువలను శుభ్ర పరుస్తున్నారు తప్పితే మిగిలిన ప్రాంతాల్లో లేదన్నారు. శుభ అభినందన్ పక్కన రూ. 42 లక్షలతో రోడ్డు నిర్మించారన్నారు. కానీ ఈ రోడ్డు నివాసాలు లేని చోట జీడి తోట పక్కన నిర్మాణం జరిగిందన్నారు. తనకు అర్థం కానీ విషయం ఏమిటంటే చదువుకున్న ఇంజినీర్లు ఎలా అక్కడ రోడ్డు నిర్మించారో చెప్పాలన్నారు. అసలు ఆ రోడ్డు మీద ఆధార పడే ఒక్క నివాసం కూడా అక్కడ లేదన్నారు. ఇదే పరిస్థితి ఉత్కళ కాలేజీ వద్ద రు. కోట్లాది రూపాయల వ్యయంతో పొలాల మధ్య రోడ్డు నిర్మించారని, ఇంకా కాలువలు కూడా నిర్మాణం చేస్తారన్నారు. ఒక్క నివాసం లేని చోట కోట్లాది రూపాయలు వృథా చేశారని ఆరోపించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సౌమ్య మహాపాత్రో మాట్లాడుతూ.. తాను వైస్ చైర్మన్ అయినప్పటికీ తనకు తెలియకుండా చైర్మన్, దళారులు, అధికారులు నిర్ణయాలు చేస్తున్నారన్నారు. అవినీతిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సమావేశంలో బీజేడీ నాయకులు తపస్ త్రిపాఠి, భీమె హరిజన్, ప్రమెద్ త్రిపాఠి, సరోజ్ పాత్రో పాల్గొన్నారు.

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారికి స్వర్ణపుష్పార్చన



స్వర్ణ పుష్పార్చన అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణ పుష్పాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునుంచి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, వేదపండితులు సాయికిరణ్, అచ్యుతశర్మ, దూసి శివప్రసాద్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్ వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పోలమాంబ హుండీల ఆదాయం లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి హుండీల ఆదాయాన్ని ఈవో వీవీ.సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. చదురుగుడి, వనంగుడి ఆలయాల్లో మార్చి 28వతేదీన హుండీలను ఏర్పాటుచేశారు. అప్పటినుంచి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు హుండీలలో సమర్పించుకున్న కానుకలు లెక్కించగా, రూ. 3,99,618 ఆదాయం సమకూరినట్లు ఈవో సూర్యనారాయణ తెలిపారు. హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో సాలూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహణ అధికారి టి.రమేష్, సర్పంచ్ వి.సింహాచలమమ్మ, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జూన్ 2న కలెక్టరేట్ ఆవరణలో ధర్నా

పార్వతీపురం: జిల్లా విద్యాశాఖకు రెగ్యులర్ డీఈఓను నియమించాలని కోరుతూ జూన్ 2న కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంఘ ప్రధానకార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. జిల్లా ఏర్పడిన తరువాత వరుసగా మూడుసార్లు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో రాష్ట్రంలో ప్రధమ స్థానం సాధించిన జిల్లాకు పూర్తి స్థాయి డీఈఓను నియమించకపోవడం బాధాకరమన్నారు. డీఈఓ నియమాకంలో జిల్లా ఉన్నతాధికారులు తీరు తీవ్ర అభ్యంతరకరమన్నారు. పూర్తిస్థాయి డీఈఓను నియమించేంతవరకు తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జియ్యమ్మవలస రూరల్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి తూ గడ్డి మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాలప్డాడు. ఈ సంఘటన జియ్యమ్మవలస మండలంలోని పరజపాడు గ్రామంలో జరిగింది. దీనిపై చినమేరంగి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన శంబంగి గోపి నాయుడు(51) కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధడుతున్నాడు. శుక్రవారం ఉదయం సుమారు 10గంటల సమయంలో భార్య ఉపాధి పనులకు వెళ్లిన అనంతరం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో స్థానికులు 108 సహాయంతో చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలపగా చినమేరంగి ఎస్సై పి.అనీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశాు. తెలిపారు. మృతి చెందిన గోపినాయుడికి భార్య అన్నపూర్ణమ్మ, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు శిరీష, సౌజన్యలు ఉన్నారు.

ఐటీడీఏలో పీఓల కాన్ఫరెన్స్

సీతంపేట: వచ్చేనెల మొదటి వారం సీతంపేట ఐటీడీఏలో ఐటీడీఏ పీఓల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఉన్న ఏడు ఐటీడీఏలలో ప్రతినెలా ఒక్కో ఐటీడీఏ నుంచి కాన్ఫరెన్స్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మొదటి కాన్ఫరెన్స్ ఇక్కడ నుంచే నిర్వహించనున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు, కమీషనర్లు, ఐటీడీఏ పీఓలు హాజరు కానున్నట్లు సమాచారం.

పొగాకు జోలికి పోకు..!

- ప్రాణాలు తీస్తున్న ధూమపానం
- నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ వచ్చే ఆస్కారం
- పొగతాగేవారితో పాటు పక్కన పీల్చే వారికి ముప్పు
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం



ఊపిరితిత్తుల సమస్యతో వచ్చిన రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు



నికోటిన్ పేచర్స్

మత్తెక్కించే వగలమారి వయ్యారి
నువ్వు తోడైతే జీవితం ఎడారి
మండుతూ ఆరోగ్యానికి ఎసరు పెడతావు
పొగగా మారుతూ ఊపిరి తీస్తావు
బూడిదవుతూ జీవితాలను బూడిద చేస్తావు
వినోదం అని నీతో జత కడతారు పిచ్చి జనం
వ్యసనంగా మారిపోవును నీతో సహవాసం
విషాదంతో బజారు పాలవును కుటుంబం
వదులుదాం..కదులుదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



సిగరెట్ తాగుతున్న వ్యక్తి

విజయనగరం ఫోర్ట్: పొగాకు ఉత్పత్తులు తినడం, పొగాకు తాగడం కారణంగా జిల్లాలో గుండెపోటు, కేన్సర్, వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గుండెపోటుకు గురైన ప్రతి ముగ్గురిలో ఒకరు ధూమపానం కారణంగానే ప్రమాదకర పరిస్థితి బారిన పడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. మధుమేహ వ్యాధి అదుపులో లేకపోవడంతో ఆ ప్రభావం కిడ్నీలు, లివర్, కళ్లు వంటి కీలకమైన అవయవాలపై పడుతుంది. సిగరెట్, చుట్ట తాగడం ఫ్యాషన్‌గా మారిపోతోంది. ఒకరిని చూసి మరొకరు సిగరెట్, చుట్టలు తాగడం అలవాటుగా మార్చుకుంటున్నారు. రోజురోజుకూ పొగతాగే వారి సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో పొగతాగే వారి సంఖ్య 30 శాతం వరకు ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఒక సిగరెట్ నిమిషం జీవితకాలాన్ని తగ్గించేస్తుందన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగకూడదన్న నిబంధన బుట్టదాఖలవుతోంది. సిగరెట్ తాగిన వారితో పాటు పక్కనున్న వారు ఆ పొగను పీల్చినా వ్యాధుల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. గతంలో నిరాక్షరాస్యులు, గ్రామీణ ప్రాంతవాసులు ఎక్కువగా సిగరెట్, చుట్టలు తాగేవారు. కానీ నేడు పల్లె , పట్టణం తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పొగతాగుతున్నారు. యువత సిగరెట్ తాగడానికి అలవాటు పడడం ఆందోళన కలిగిస్తున్న అంశం. పొగ తాగడం వల్ల అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిసినప్పటికీ అలవాటు అయిన వారిలో మార్పు రావడం లేదు. పొగతాగుతున్న వారిలో 8 శాతం మంది యువత ఉండడం గమనార్హం. పొగతాగుతూ స్వయంగా అనారోగ్యం బారినపడడమే కాకుండా చుట్టుపక్కల ఉన్న వారిని కూడా అనారోగ్యం పాలుచేస్తున్నారు. జిల్లాలో పొగతాగుతున్న వారిలో పురుషులు 20శాతం మంది కాగా మహిళలు 10 శాతం మంది ఉన్నారు. యవత 8శాతం మంది ఉన్నారు.

ఏడాదికి రూ.1.20 కోట్ల వ్యాపారం

అన్ని రకాల వర్గాల వారికి సిగరెట్లు, చుట్టలు అందుబాటులో ఉన్నాయి. ఏడాదికి రూ.1.20 కోట్ల వరకు సిగరెట్లు, చుట్టల కోసం ఖర్చు చేస్తున్నారు. సామన్య ప్రజలు చుట్టలు, తక్కువ రకం సిగరెట్లు తాగుతున్నారు. సంపన్నవర్గాలు వారు ఖరీదైన సిగరెట్లు తాగుతున్నారు .

2024 -25లో కేన్సర్ బారిన 299మంది

2024-25 లో జిల్లాలో 299 మంది నోటి, గొంతు కేన్సర్ బారిన పడ్డారు. ఊపిరితిత్తుల కేన్సర్ , ఆస్తమా, సీఓపీడీ వ్యాధుల బారిన జిల్లాలో 5 వేల నుంచి 6 వేల మంది పడుతున్నారు. కేన్సర్ ముదిరినంత వరకు గుర్తించలేకపోవడం వల్ల మృత్యువాత పడుతున్నారు. కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. కానీ ముదిరితే మరణమే శరణ్యం.

పొగతాగడం వల్ల ప్రాణాంతక వ్యాధులు

సిగరెట్, చుట్ట తాగడం, ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు తినడం వల్ల ప్రాణంతకమైన కేన్సర్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. పొగతాగడం , పొగాకు ఉత్పత్తులు తినడం వల్ల గొంతు, ఊపిరితిత్తుల కేన్సర్, నోటి కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. అదేవిధంగా ఆస్తమా, సీఓపీడీ వచ్చే ఆస్కారం ఉంది. వాటితో పాటు క్రానిక్ బ్రాంక్‌లైటిస్ వ్యాప్తి చెందే పరిస్థితి ఉంది. పొగతాగడం వల్ల నిమోనియా వ్యాధి అధికమవుతుంది. ఇన్‌ఫెక్షన్స్ వ్యాప్తి అధికమవుతుంది. పొగాకును కొంతమంది ముక్కు వద్ద పీల్చుతుంటారు. మరి కొంతమంది నోటి ద్వారా పీల్చుతుంటారు. పొగ ఎక్కువగా పీల్చడం వల్ల దాని ప్రభావం రక్తనాళాలు, నాడీ వ్యవస్థపై పడుతుంది. ఫలితంగా బీపీ పెరుగుతుంది. నిద్రలేమి సమస్య వస్తుంది. దీని వల్ల గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ బారిన రోగులు పడుతున్నారు. పొగ తాగేసి మానివేసినప్పటికీ వయసు పెరిగే కొద్దీ దాని ప్రభావం ఆరోగ్యంపై చూపుతుంది.



చూయింగ్ గమ్స్

స్మోకింగ్ వల్ల జీవిత కాలం తగ్గుతుంది



సిగరెట్లు, చుట్టలు తాగడం వల్లజీవిత కాలం తగ్గిపోతుంది. సాధారణంగా 70 ఏళ్ల జీవించేవారు 60 నుంచి 65 ఏళ్లకే మరణిస్తారు. అతితక్కువ వయస్సులో (30 నుంచి 35) ఏళ్లకే మొదడు పోటుకు గురయ్యే అవకాశం ఉంది. ఊపిరితిత్తులు ఉబ్బి ఆస్తమా వంటి వ్యాధులతో పాటు ఊపిరితిత్తుల కేన్సర్, గొంతు అన్నవాహిక కేన్సర్, మూత్రాశ్రయం, లివర్, వ్యాధులు సోకే అవకాశం ఉంది. పొగతాగడం వల్ల మధుమేహం, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు మందులు వాడినా పనిచేయని పరిస్థితి. పొగతాగడం, పొగాకు ఉత్పత్తులు మానివేయడం కోసం చూయింగ్ గమ్స్, నికోటిన్ పేచర్స్ వాడుకోవాలి.

డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్
పలమనాలజిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

బినామీ మస్తర్లు వేసుకున్న వారికి రికవరీ నోటీసులు

- మేట్లకు షోకాజ్

సాక్షి ఎఫెక్ట్



ఈనెల 22న సాక్షిలో వచ్చిన కథనం

గంట్యాడ: మండలం లోని నరవ గ్రామంలో ఉపాధిపనుల్లో బినామీ మస్తర్లు వేసుకుని అక్రమాలకు పాల్పడిన విషయాన్ని సాక్ష్యాలతో సహా సాక్షి వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష అభియాన్ లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సారాది సత్యనారాయణ బినామీ మస్తరు వేసుకోవడంతో అతనికి రూ. 1260 పేమెంట్ జనరేట్ అయింది. అదే విధంగా సుంకరి సత్యనారాయణ అనే వ్యక్తి విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం అనంతవరంలోని ఓ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఆయనకు కూడా పనికి వెళ్లక పోయినా పనికి వెళ్లినట్టు బినామీ మస్తర్ వేయడంతో రూ.3276 పేమెంట్ జనరేట్ అయింది. వీరితో పాటు మరి కొంతమంది గ్రామంలో బినామీ మస్తర్లు వేసుకుని అక్రమాలకు పాల్పడి వేలాది రుపాయిలు కొల్లగొట్టారనే విషయాన్ని సాక్షి బయట పెట్టింది. దీంతో ఉపాధి హామీ అధికారులు, ఎంపీడీఓ ఈ అంశంపై విచారణ చేపట్టారు. వారి విచారణలో బినామీ మస్తర్లు వేసుకోవడం నిజమని తేలింది. దీంతో బినామీ మస్తర్లు వేసుకున్న ఇద్దరికి రికవరీ నోటీసులు ఇస్తున్నట్లు ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తి తెలిపారు. అదేవిధంగా వారిద్దరికి బినామీ మస్తర్లు వేసిన మేట్‌లు మంగ, లక్ష్మీకాంతానికి షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు చెప్పారు.

ముందస్తు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలి

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: మూస పద్ధతికి స్వస్తి పలికి నూతన విధానాలను అవలంబించి క్షేత్రస్థాయిలో ముందస్తు సమాచార వ్యవస్థను బలోపేతం చేసి సమర్థవంతంగా శాంతి భద్రతల పరిరక్షణకు పెద్ద పీటవేయాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల పురోగతి ఎస్సీ,ఎస్టీ కేసులు, ప్రయారిటీ పీటీ కేసుల స్థితిగతులు అక్రమ మద్యం, మిస్సింగ్, సైబర్ నేరాలు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు తదితర కేసులకు సంబంధించిన విషయాలపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించిన ఎస్పీ వాటికి తగిన సూచనలు, సలహాలు, మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని సూచించారు.



విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ

అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు పాచిపెంట, కొమరాడ, గుమ్మలక్ష్మీపురంలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఉంచాలని ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉన్నారో? లేదో? అని ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టి సమాచారం సేకరణ క్షుణ్ణంగా చేసి అక్రమ రవాణాపై దృష్టిసారించాలని ఎస్పీ మాధవరెడ్డి కోరారు.

ప్రశంసాపత్రాల అందజేత

విధి నిర్వహణలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే వార్షిక ఫైరింగ్ శిక్షణలో ఉత్తమ నైపుణ్యం కనబరిచిన అధికారులు, సిబ్బందికి కూడా ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. సమావేశంలో పాలకొండ డీఎస్పీ ఎం .రాంబాబు, ఎస్‌బీ సీఐ రంగనాథం, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సోషల్ మీడియా, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ అప్పారావు, ఏఆర్ ఆర్‌ఐ రాంబాబు, సీఐలు, ఎస్‌లు, ఎక్సైజ్ అధికారులు, మెడికల్ అధికారులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రలో వైద్యశాఖ మమేకం

- డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కర రావు

పార్వతీపురంటౌన్: యోగాంధ్ర మాస వేడుకల కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ పాల్గొంటుందని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్. భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యోగాంధ్ర మాస వేడుకల కార్యక్రమం శనివారం పార్వతీపురం లయన్స్ క్లబ్‌లోను, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గల ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం, పాలకొండలోని రామ కళామందిర్ థియేటర్ దగ్గర గల గాయత్రి కల్యాణ మంటపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, శారీరక, మానసిక ఉల్లాసం, ఒత్తిడి తగ్గించడం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావు

మహిళా క్రికెట్ జట్ల ఎంపిక రేపు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1న (ఆదివారం) వివిధ వయో విభాగాల్లో మహిళల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -15 బాలికల విభాగంలో ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారిణులు 2010 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అండర్-19 విభాగంలో హాజరయ్యే క్రీడాకారిణులు 2006 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని, అండర్- 23 విభాగంలో పోటీలకు హాజరయ్యే క్రీడాకారిణులు 2002 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని విజ్జి క్రికెట్ మైదానంలో జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారిణులు, వారి ఒరిజినల్ ఆధార్ కార్డ్, జనన ధ్రువీకరణపత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకుని రావాలని పేర్కొన్నారు. అదే రోజున సీనియర్ విభాగంలో మహిళల జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని, వారు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు. ఉదయం 7.30 గంటలకు నిర్వహించే ఎంపిక పోటీలకు అన్ని విభాగాల క్రీడాకారిణులు వైట్ డ్రెస్, సొంత కిట్‌తో హాజరు కావాలని సూచించారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తన చాంబర్‌లో పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి విజ్ఞాపనలు స్వీకరించి, పోలీస్‌సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారి సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తానన్నారు. 'పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహణలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్ లోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకుని వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది తెలిపిన సమస్యలను ఎస్పీ స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకుని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి



ఎస్.కోట సబ్‌జైలును సందర్శిస్తున్న జిల్లా న్యాయమూర్తి కృష్ణప్రసాద్

శృంగవరపుకోట: పట్టణంలోని ఉపకారాగారాన్ని జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి డా.ఎ.కృష్ణ ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడుతూ కేసుల సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకుంటే మండల న్యాయసేవా కమిటీ ద్వారా సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. జైలు ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశీలించారు. న్యాయసేవా సాధికార సంస్థ ద్వారా బయట ఉన్న పేదలు కూడా ఉచిత న్యాయసాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. జూలై 5న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, కక్షిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్, న్యాయవాద సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుతో యువకుడి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడు పేట గ్రామానికి చెందిన సిమ్మ శ్రీనివాసరావు (33) శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి మృతుడి కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీనివాసరావు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం పశువులను గ్రామ సమీపంలో ఎర్ర బంద వద్ద మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు పడింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి తల్లి కృష్ణమ్మ ఇద్దరి చెల్లెళ్లు భాగ్య, లావణ్య ఉన్నారు.

మరో రెండు పాడి ఆవులు..



లక్కవరపుకోట : ఖాసాపేటలో మృతి చెందిన పాడిఆవు




లక్కవరపుకోట : మార్లాపల్లిలో మృతిచెందిన ఆవు

లక్కవరపుకోట/కొత్తవలస: లక్కవరపుకోట మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షంతో పాటు పిడుగు పడడంతో రెండు పాడిఆవులు మృతిచెందాయి. మార్లాపల్లి గ్రామానికి చెందిన గోగాడ దేముడు, ఖాసాపేట గ్రామానికి చెందిన నెల్లి అప్పలనాయుడుల రెండు పాడి ఆవులు పిడుగుపాటుతో అక్కడికక్కడే మృతిచెందాయి.

నేలబావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ కొబ్బరితోటలో ఉన్న నేల బావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే డీఎస్పీ భవ్యారెడ్డి ఎస్సై వి.ప్రసాదరావులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీనిపై ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..నేల బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వయసు సుమారు 30 నుంచి 40 ఏళ్లు, 5.5 అడుగుల ఎత్తు ఉన్నాడు. ఎరుపు, నీలం రంగు చెక్స్ షర్ట్, గోధుమ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్న వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించగా ఎక్కడా ఏ విధమైన దెబ్బలు లాంటి ఆనవాళ్లు ఎక్కడా లేవు. అనుమానించ దగిన గుర్తులు ఏవీ లేవని,ఫోరెన్సిక్, పోస్టుమార్టం నివేదికలు వస్తే గాని పూర్తి వివరాలు చెప్పలేమని ఎస్సై తెలిపారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువైద్యశాలల్లో అధికారుల ఖాళీ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలను సంబంధిత ఉన్నతాధికారులకు పంపించినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా.ఎస్.మన్మథరావు తెలిపారు. ఈ మేరకు ఈనెల 25న సాక్షి దినపత్రికలో 'పశువైద్యుల కొరత' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందిస్తూ జిల్లాలో ఏడు పశువైద్యశాలలు, 38 పశు వైద్య శస్త్ర చికిత్సాలయాలు, 35 గ్రామీణ పశు వైద్య కేంద్రాల ద్వారా సేవలందిస్తున్నామని ఈ మేరకు జిల్లాలో సహాయ సంచాలకుడు 1, పశువైద్యాధికారుల పోస్టులు 20, పారావెటర్నరీ సిబ్బంది పోస్టులు 15 ఖాళీ ఉన్నాయన్నారు. అలాగే 80 పశువైద్య భవనాలలో 41 వైద్యశాలలకు మరమ్మతులు చేయాల్సి ఉందని, 28 నూతన భవనాలను నిర్మించాలని పై స్థాయి అధికారులకు నివేదికలు సమర్పించామన్నారు. అత్యవసర సమయాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించి సేవలందిస్తున్నామని స్పష్టం చేశారు.

114 మంది ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు స్థానచలనం

- నేడు ఎస్‌ఏ టీచర్స్ సీనియార్టీ జాబితా విడుదల, ఖాళీల ప్రదర్శన

విజయనగరం అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీ షెడ్యూల్‌లో భాగంగా శుక్రవారం ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎం బదిలీల అలాట్మెంట్ ప్రక్రియ పూర్తయింది. దరఖాస్తు చేసుకున్న 125 మంది ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలలో 114 మందికి బదిలీ అవకాశం లభించింది. వారిలో తప్పనిసరి బదిలీ కావాల్సిన 8 సంవత్సరాల సర్వీసు ఉన్న ఐదుగురు, మిగులు పోస్టుల్లో పనిచేసిన వారు 78 మంది మొత్తం 83 మంది ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ టీచర్ల సీనియార్టీ ప్రొవిజినల్ జాబితాపై 168 మంది నుంచి అభ్యంతరాలు వచ్చాయి. వాటిని సవరించి షెడ్యూల్ ప్రకారం తుది జాబితా శనివారం విడుదల చేస్తామని డీఈఓ యూ.మాణిక్యం నాయుడు తెలిపారు. అదేవిధంగా స్కూల్ అసిస్టెంట్ టీచర్ పోస్టుల క్లియర్ వేకెన్సీని వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని వెల్లడించారు.

జంఝావతి ఆయకట్టుదారుల గోడువినండి బాబూ..

కొమరాడ: జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేసి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందేలా చూడాలని జంఝావతి సాధన సమితి అధ్యక్షుడు చుక్క భాస్కర రావు డిమాండ్ చేశారు. ఆయకట్టు రైతులు, సమితి సభ్యులతో కలిసి జంఝావతి రబ్బరు డ్యామ్ వద్ద శుక్రవారం పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు. అనంతరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై నిరసన తెలిపారు. 2006లో వైఎస్ రాజశేఖరరెడ్డి కృషితో నిర్మాణం పూర్తయిన రబ్బర్‌డ్యాం వల్ల సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ప్రాజెక్టు పూర్తిచేస్తే మరో 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఒడిశాతో ఉన్న వివాదం పరిష్కారం కాక ప్రాజెక్టు పూర్తికావడం లేదన్నారు. ప్రస్తుతం ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వమే ఉందని, నాయకులు దృష్టిసారిస్తే ప్రాజెక్టు సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఆ దిశగా స్థానిక కూటమి నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రాజెక్టు పూర్తయితే కొమరాడ, గరుగుబిల్లి, పార్వతీపురం మండలంలోని పలు గ్రామాలకు పుష్కలంగా సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ మరిశర్ల మాలతీకృష్ణమూర్తి నాయుడు, వి.దాలినాయుడు, ప్రజాసంఘ నాయకులు పాల్గొన్నారు.